కథా నిలయం
5763
శ్రీకాకుళం

ప్రజావాణి: 30-11-1958

# నామీదే నర్రోయ్!

"నా మీదే నర్రోయ్!"

"ఒక్కొక్కమారు వెధవ పని చేస్తేగాని గొప్పతనం రాదు."

చచ్చి ఏలోకాన బస చేశాడో మహానుభావుడు! ఉన్నన్నాళ్ళూ అనంతవాదులైన ఆంధ్రుల్ని తన హాస్యరసంలో ముంచి గుక్క తిరక్క, ఆపై ఆనంద బాష్పాల్ని రాల్పించినవాడు హాస్య బ్రహ్మ! సాటిలేని మేటి మాటల్ని ఆంధ్రులకు బేషరతుగా సరఫరా చేశాడు. ఆయన లిమిటెడ్ డిపోలో మాన్యుఫాక్చరైన ఆ రెండు మాటలు, ఎంత స్వానుభవం, ఏకపాళంగా సంపాదించి మరీ వ్రాశాడో! ఈనాటికీ ఆడప దడప నాబోటి కొందరికి లుడుంగున సరిపోతూనే ఉన్నాయి.

అస్మదీయుడు బుద్ధెరిగి ఎదుటివారి సహాయసానుభూతులు లేకుండా కట్టుకోటం అలవడ్డాక ఓ లగ్నాన కథ వ్రాశాను. వ్రాయటమేమిటి, ఆపాళాన సుబ్బరంగా అచ్చయి, ఆంధ్రప్రదేశ్‌లో విడుదలైంది. అంతా ఏకటాకీన జరిగిపోయింది.

ఆ కథకు యజమానినైన నేను ఆకాశమంతెత్తు ఎగరకపోయినా, చిల్లి ముంతంత మొహం చేసుకోకపోయినా, క్లోజప్‌లో చాలా చాలా ఆనందించా! అచ్చయి ముచ్చటగా ఉన్న అస్మదీయ నామాన్ని పదే పదే తిలకించాను. "ఉహూ" మురిసిపోయాను. "అహో" అని నా మనసు ఎలుగెత్తింది. "ఎవరు నువ్వు" అనే మూడ్‌లో చూశా!

"నువ్వొక గొప్ప కథకుడివి. నీలో ఆ లక్షణాలు వెల్లిగ్రక్కుతున్నాయి. చూడు ఎంత గొప్ప పేపరులో అచ్చయిందో నీ కథ" అంటున్నది మనసు!

కాలు మెదిల్చి బజార్లో పడి, కనుపించిన మిత్రులకు, అభిమానులకు, సానుభూతి పరులకు, మన ప్రయోజకత్వానికి పబ్లిసిటీ ఇచ్చేశాం! కొందరు అభిమానులు అభినంద నలు, ఆపైవాళ్ళు ఆశీస్సులు, మిగిలినవాళ్ళు ఉచిత సలహాలు ఇచ్చేశారు! కొందరు "ఎట్లా! నిజంగా?!.... నువ్వే!! ఏమోనబ్బ! నమ్మలేం! ఎవరన్నా నీ పేరెట్టారేమో! అసాధ్యు డవే! ఏమోననుకున్నా సుమీ! అనుకున్నాలే నువ్వేనని - నాకేనాడో తెలుసయ్యా నీలో ఆ కళున్నదని!.... ఫర్వాలేదు చూశానోయ్! బాగుంది" అన్నారు.

"ఓహో! తస్సదీసిరి! ఈ కథ వ్రాయటం గాదుకానీ తట్టెడు కీర్తీ, పుట్టెడు గొప్పతనము, అదీ ఇదీ బోలెడు బోలెడు లాభములున్నాయ్ గదా" అనుకున్నా!

వీధి భాగోతం ముగించుకుని, పేపరు చంకలో ఇముడ్చుకు, ఆనందంబు మనంబున పెనగొన ఆదరా బాదరా మామ్మగారిల్లు చేరి, ఆ వార్త వారి చెవుల్న కూడ వేశా!

"ఏమిటీ మనవాడేనా! ఏరా.... ఇంత వాడవయావురా అబ్బీ!" అనేసింది బామ్మ ఆశ్చర్యంగా నోరు తెర్చి.

నా కథను యింట్లోవాళ్ళు సరేసరి గదా యింటి ప్రక్కవాళ్ళు, ప్రక్కవాళ్ళ ప్రక్కవాళ్ళు, ఎదురింటి డాక్టరు శానయ్య, వారి ప్రక్క భాగంలో కాపురముంటున్న వివాహాల విస్సన్న గారు, ఆపై రాజకీయ విజ్ఞాన పారంగతుడు మాలోకంగారు చదివారు. కరకర గరగర, మరమరాల్లా చదివేశారు!

అలా నా బంధుమిత్ర సపరివార సమేతంగా నా కథ చదువబడ్డది. వారందరిలోను కాస్తో, కూస్తో "లెక్కలో వాడే సుమా!" అనిపించుకున్నా.

ఎవరన్నా "ఎవరు మీరు?" అనడిగితే!

"ఒహ గొప్ప(కథ) వాణ్ణి" అందామనుకుంటా! కానీ ఎదుటివాళ్ళు "ఘనీభవించి మారువేషం వేసుకు చక్కా వచ్చిన నమ్రభావమా ఏమిటి చెప్మా వీడూ" అని పూర్వం అనుకున్న వాళ్ళంతా "వెధవ ఓ కథ బరికేశాడో లేదో అపుడే నీటొచ్చిందే సన్నాసికి? మొన్నటి దాకా ఇంగిలీషు బళ్ళో తెలుగు కాంపొజిషన్, ఇంపొజిషన్ లేకుండా వ్రాయలేని వెధవకు!..." ఇంకా అంటారు. పైగా పోతూ పోతూ ఎలా ఈ శరీరం అస్థిరమని తెలుసు గదా! తెలిసికూడా ఆ భమిడిపాటి ఏమన్నాడో చూశారా! ఆ అన్న మాటలు శిలేసుకు స్థిరంగా నిలుస్తాయిగా మరి! "అసలే కోతి! (అంటే నేను) కోతంటే.... మనమంతా కోతు ల్లోంచి వచ్చామని గదటండీ ఆ పాశ్చాత్యుడు వాక్రుచ్చాడు! ఏ లక్షణాలు చూశాడో మరి!.... అందులో కల్లు త్రాగింది! ఆ పైని తేలు కుట్టింది. దరిమిలాను దయ్యం (ఏ జాతిదో ఆయన వివరించలా) పట్టింది..... ఆ పైని కథ వ్రాసింది. ప్రముఖ పత్రికలో అచ్చుయింది అలా ఉంది వీడి పని" అని అంటారు. అనుకుని పోతారు! అందుకనే కాస్త.... సంతోషాన్ని- స్వగతంలోనే ఉంచేవాణ్ణి!

ఇలా కథ నడుస్తుండగా అపుడేమైందంటే! ఓ అరుణోదయ వేళ రస్తాలో నడుస్తున్నా!

"యహోయ్! పంతులూ! నిన్నేనయ్యోయ్! నీ సిగతరగ పంతులూ! మా బాగా రాశా వోయ్ కత. వాళ్ళకు బుద్ధొచ్చేలా వ్రాశావు!" అంటూ నా ఆర్షేయ పౌరుషాలు వల్లె వేయటం వినిపించింది. డైరెక్షను త్రిప్పి కెనడియన్ ఇంజన్‌లా అరచిన వేపుకు చూశా ఎవరా అని. ఇంకెవరు సాక్షాత్తూ మునసబుగారు! మా ఊరి మునసబు - అందులో తెలుపు, నలుపు మీసాల్ని కలయత్రిప్పుతూ చేతిలో గొడుగూ.... నిలబడున్నారు కిళ్ళీబడ్డీ ప్రక్కన.

"ఒహో" అని తల పంకించి వారి సన్నిధి చేరా!

"పంతులూ! ఈ మద్దె కథ రాస్తినే! అది చూసుకు వాళ్ళు మా గునుస్తున్నార్లే! అయితే అయింది ధైర్నం చేసి మా మొనగాడి పని చేశావ్!" అంటున్న ఆయన్ని కొశ్చన్ మార్కు బ్రాండులా మొహం వ్రేలాడేసి చూశా. ఉపోద్ఘాతం, పీఠిక, ముందుమాట, ప్రిఫేస్,

వగైరా అనుబంధాలు విడిచేసి మునసబుగారు మాట్లాడటం నచ్చకపోగా అర్థం గాలా!

"ఎవరికి బుద్ధొచ్చేలా పనిచేసింది నా కథ!? అసలు కర్తెవరు? కర్మేమిటి? క్రియ ఏమిటి? ఏమా కథ? మహాత్మా మాయందు కటాక్ష వీక్షణాదృష్టులు బరపి సాంగోపాంగంగా వివరించ మదిని గోరుతున్నాను. మదీయ అభీష్టంబు ఈడేర్పవలసింది" అని డైలాగ్ వల్లె వేయకపోయినా అదే అర్థం మునసబుగారికి తట్టేలా ఆయన్ని అడిగాను!

"హారి పిడుగా! ఇంత కథా నడిపి, ఏం తెలియనట్లు నా దగ్గర నాటకం వేస్తావ్! అసలు నువ్వు కథ వ్రాసింది ఈశ్వరయ్య వాళ్ళను గురించి కదూ!"

'అవునేమో' నేను మాట్లాడలా.

"వాళ్ళకు, మీకూ, ఉన్నటువంటి మనస్పర్ధలు, అందరికీ తెలుసుగదా! ఆ కారణంగానే నువ్వు మీ వాళ్ళందరి ప్రేరణ చేత - వాళ్ళ బుచ్చియ్యకు కట్నం ఇవ్వని కారణాన - అంటే ఇవ్వలేదన్న నెపాన వివాహం వాయిదా వేసుకోగా - నీవు ఆ కథాలంబనంతో కథ వ్రాశావని - నేననటం కాదయ్యోయ్! ఈశ్వరయ్య వాళ్ళు అంటున్నారు."

రుచి, అనుతున్నది కాస్త, కాస్త రవ్వంత. "ఊహూ"

"అసలు మొదట్నుంచీ విను. నువ్వు కథ వ్రాశావని పేపరు మొదటగా చూసిన జానకి రామయ్య అన్నాడు పెద్దగానే పదిమందిలో....రచ్చకాడ! మనూరోడివాయ్ అదేందో విందాం చదవమన్నాం ఆయన్నే! పెద్దగా చదవగా మేమంతా విన్నాం. తీరా ఆసాంతానికి "ఓహో ఈశ్వరయ్యను గురించా" అనుకున్నాం. నవ్వుకున్నాం. ఓడు ఏం చేశాడంటే ఆ పేపర్ని ఈశ్వరయ్యకు ఇంటికెళ్ళి ఇచ్చి "మీ గురించి పంతులుగారి అబ్బాయి కథ వ్రాశాడు. బజార్లో గోలగా ఉంది" అనన్నాడుట. ఆయన చదివాడు. భగ్గుమన్నాడు. ఆయన భార్య గొంతెత్తి అట్టాంటివాళ్ళు, ఇట్టాంటి వాళ్ళు అని తిట్టటం బజార్లో మా కందరికీ వినిపించినయ్! ఆ కాడనుంచి కుక్కమీద, పిల్లిమీద బెట్టి మీ వాళ్ళను ఏందో అన్నారు. మొత్తానికి నా సామిరంగా, మా దొడ్డపని చేశావుగందా! ఊరంతా గుప్పుమనే!"

"ఉహూ! ఇంకేమన్నా.....!"

"ఆ ఇంకేమంటారులే! ఇదిగో అయ్యోయ్. నేచెప్పానని ఏడ అనగాకు. మళ్ళీ అదేం రభసొద్దో."

విషయం అసాంతం అవగతమైంది. ప్రథమంగా ముచ్చటపడి కథ వ్రాయటమేమిటి? 'నామీదే' అని మొహాలు వ్రేలాడుదీసుకోవటమేమిటి! మునసబుతో "వస్తా"నని విసవిసా అక్కడ నుంచి నిష్క్రమించా!

మళ్ళీ కొన్ని రోజుల్దాకా మా గ్రామము వార్తలేమీ చేరలా. ఒక మధ్యాహ్నం నేనూ, రంగబాబు కాలేజి నుంచి వస్తున్నాం! మా ఊరి జనాభాలో ఒకడైన మిత్రుడు కనిపించాడు. పరస్పర క్షేమ సమాచారాలు చెప్పుకున్న తరువాత "ఏమోయ్ నీవు కథలు వ్రాస్తావని తెలియదు సుమా. నటకుడివే గాక కథకుడివిగూడా నన్నమాట. భలేపని చేశావోయ్! లేకపోతే నెత్తిమీద ఉన్న సంచునంతా (సంచు అంటే నానా అర్థాలలో సంతానం!) పెట్టి

మా గొడ్లపాకంతా నాశనం చేశాడు. అసలు వార్నింగ్ ఇచ్చాలే! ఈతాప హద్దు దాటావంటే పిలకుచ్చుకు చెర్లో ముంచుతా కబడ్దార్" అని. ఇంకా ఏమేమో స్వవిషయం, పరవిషయం, ఏకపాళాన మిళాయించి గుటక వేయకుండా చెప్పుకుపోతున్నాడు. మా రంగడు మొహం వ్రేలాడేసి కొడిగట్టిన దీపంలా చూశాడు - ఏమిటి సంగతని? అతగాడ్ని వదిలించుకు రస్తా పుచ్చుకున్నాం.

"ఎవడయ్యా ఆయన కథ గురించి ఎత్తుకుని, ఎవరిమీదనో అవాకులూ, చెవాకులూ అనేశాడు. ఏమిటి కథ? పూర్వవృత్తాంతంతో వివరించు."

"ఏముందిరా పిచ్చినాకొయ్య. ఇతగాడొక నాటకాల పిచ్చగాడు. ఇతగాడి గొడ్లపాక, ఈశ్వరయ్య అనే ఆసామి యింటి ప్రక్కన ఉంది. ఆ రెండు స్థలాల మధ్య గోడ దగ్గర మడత పేచీ. భోరున వాన కురుస్తున్నా, ఆ రెండు కుటుంబాల మధ్య తగాదా చల్లారదు. ఈ మధ్య అస్మదీయుడు వ్రాసిన కథ ఆ ఈశ్వరయ్య తాలూకు కథ అని పుకారు తలెత్తింది. వంతగాళ్ళు "ఖాయంగా" అనేశారు! మధ్యవాళ్ళు పుల్లలెట్టి కెలికారు! అదీ పూర్వకథ. "మన శత్రువు శత్రువు మనకు మిత్రుడు" అనే సూత్రం అన్వయించుకుంటే ప్రాబ్లమ్ సాల్వ్ అవుతుంది".

"హారీ లోకం!!" అన్నాడు రంగబాబు హాపళంగా నోరు తెర్చి!

"అంతేరా సన్నాసి! పూర్ ఫెలో!"

ఈ కథ వినేసి రంగడు పూర్తిగా డీలా వేశాడు మొహం!

ఇలా నా కథ తలొక విధంగా తయారు చేసుకు ఆపైన ఊహించుకు భావించుకున్నారు కామాలు!

కొంతకాలం తర్వాత పుట్టింటికి వెళ్ళాల్సొచ్చింది. ఎంత నాగరికత మన మీద మురిసినా ఏడాదికోసారైనా పుట్టింటి మొహం చూడక తప్పదుగా!

ఊళ్ళో ప్రవేశించగానే మొదటగా చూసింది దాసుగారు.

"ఏవయ్యా! మహానుభావా! ఉన్నట్టుండి... నీతో స్నేహ ఫలితానికి నీతోపాటు నాకూ వడ్డించారు గదటయ్యా! దూరంగా ఉన్నావు కాబట్టి చెవులార వినే అవకాశం నీకు చేజారి పోయింది గానీ నీ నా మొత్తం నేనే పుచ్చుకొన్నాను. కథ గాదు గానీ....!"

"అవునండీ మరి! ఇనుముతో స్నేహం చేసిన నిప్పు గూడా సమ్మెటపోట్లు అచ్చుకోవాలి గదా!.... అసలింతకు మీ మీద దేనికి విసురుకుంది?"

"అడుగుతావ్! అందరికీ లోకువ బడి పంతులేగా! మనిద్దరం స్నేహితులవటం మూలాన నాకేదో కాస్త వాఙ్మయంతో సంబంధీకుడిని గాబట్టి తత్ రచన నాచే వ్రాయబడి, నీ పేరున పేపరెక్కిందనీ అభిజ్ఞాన వర్గాల వారి అంచనా! చూశావా పెద్దల బుద్ధి సూక్ష్మత!"

"అందుకే గాదుటండీ ఆ పాశ్చాత్యుడు మానవులు కోతి తాలూకు వారని ముద్ర వేశాడు. ఆ లక్షణాలు ఆకారం మారినా వికారం పెడుతూనే ఉంటాయి".

"భేషుగ్గా అన్నావ్!"

ఆ తర్వాత మా హితుడు, బంధువు, గ్రామంలో మోతుబరి, ఇంటికి ఆహ్వానించి కూర్చోబెట్టి - పీటేసి - కూర్చున్నతరువాత "ఏమిరా నీవు కథలు వ్రాయటం ఎప్పట్నించిరా?" అని ఆశ్చర్యంగా నోరు అప్పళించాడు.

చెప్పొద్దూ! నాకు సిగ్గు, సంతోషం పొంగుకొచ్చి ఆపాట్న చిన్న చిరునవ్వు వెలిబుచ్చి అలవోకగా తలొంచుకున్నా.

"నువ్వొక్కడవే వ్రాశావా లేక ఇంకెవరన్నా.....!"

"అంటే?" మొహం చిట్లించి చూశా పరువుకు భంగం వచ్చినట్లు.

"అహ! దాసుగారు కూడా చెయి కలిపాడేమోనని?"

"ఆయనన్నడక్కపోయారా!"

"ఆ! నువ్వుండగా ఆయనన్నడగటమేమిటి?.... పోనీ అనుకున్నారా వ్రాద్దామని?"

ఇలా సవాలక్ష యక్ష ప్రశ్నలు వేసినా సమాధానం ఒకటే.

"హమారా స్వంతం."

"సరేలే అంతా బాగానే ఉంది గానీ మధ్య నన్ను యిరికించా వెందుకు? అసలే నేనంటే గుడ్లు మిటకరించుకు చూస్తారు. మధ్య యిదో పిడకల వేట.... ఎందుకులే!" నిట్టూర్చాడు.

ఫ్రీ టిక్కెట్టు మీద కథలో దూరిన అయన్ని చూసి మధ్య ఈయనకేం వచ్చిందా అననుకున్నా. అడిగా "ఏం నిన్నేమన్నా......"

"ఊ! అడుగుతావ్! ఆ దక్షిణపు చేను దగ్గర మాకూ వాళ్ళ (ఈశ్వరయ్య అని)కూ తగాదా గాదా! నీకు తెలియన్దేముంది! ఇంకేం కచ్చచేత సాధిద్దామని నేను ప్రేరేపించి వ్రాయించానని వాళ్ళ ఊహ..... ఏముంది! ఎలా వీడి కొంపకు ఎసరెడదామనేగా ప్రతి వెధవ ఆలోచన? అందర్లోకి పచ్చగా వీడెందుకున్నాడు. పిల్లా జెల్లా లేరుగా! ఏం కట్టుకు పోతాడో అని ఆలోచన."

"బాగుంది! నే కథ వ్రాయటమేమిటి.... అయినా కథ వీళ్ళను గురించేనని ఎందుకనుకోవాలి?"

"అదిగో ఆ వేణుగోపాలస్వామికి తెలియాలి?"

◆ ◆ ◆

"అదీ కథ" అర్థమైందా! కాకపోతే.... చివరకు ఏమనిపిస్తున్నదంటే భమిడిపాటన్నట్టు- "ఒక్కోమారు వెధవపని చేస్తేగాని గొప్పతనం రాదు!" అంతేనేమో! కాకపోతే ముచ్చటపడి కథ వ్రాశానే అనుకోండి! వ్రాసినందుకుగాను "నామీదే నర్రోయ్" అని ప్రతి కోన్ కిస్కాగాడు అనుకోవటం, ఆ పైన "ఏం బాగా లేదురా అబ్బీ" అన్నట్టు - ఆముదం వికార పెట్టినట్టు - ముహం జేవురించుకుని ఫీలింగ్ ఇవ్వటమేమిటి? ఇంతేనండి లోకం! రాను రాను వీళ్ళ బుద్ధులు యిరుకు గొందుల్లో పహారా కాస్తున్నాయ్ సుమా! ●